ప్రజాశక్తి

శనివారం 12 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మోడీ పర్యటన నేపథ్యంలో..

విశాఖలో అరెస్టుల పర్వం

- 'ఉక్కు' కార్మికులు, సిపిఎం, సిపిఐ నాయకుల అరెస్టు
- కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ శిబిరంపై పోలీసుల దాడి
- 55 మంది పలు పోలీస్ స్టేషన్లకు తరలింపు



పోలీసుల అరెస్టుకు ముందు 'ఉక్కు' కుటుంబాలతో నిండుగా ఉన్న శిబిరం



దీక్షా శిబిరాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుని అక్కడే కూర్చున్న పోలీసులు



జగ్గునాయుడును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఉక్కునగరం, పెందుర్తి, ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్

ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో శుక్రవారమంతా విశాఖ జిల్లాలో అరెస్టుల పర్వం కొనసాగింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోమని ఈ నెల 12న జరిగే బహిరంగ సభలో ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలంటూ ఉద్యమిస్తున్న ఉక్కు కార్మికులపైనా, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులపైనా పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. 55 మంది విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను అరెస్టు చేసి పెందుర్తి, సబ్బవరం, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడును శ్రీనగర్ వద్ద అడ్డుకుని తొలుత మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కూ, అక్కడి నుంచి భీమిలి పోలీస్ స్టేషన్‌కూ తీసుకెళ్లారు. సిపిఐ నేతలనూ పలుచోట్ల పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయి వేటీకరణ నిర్ణయాన్ని ప్రధాని మోడీ ఉపసంహరించుకోవాలంటూ శుక్రవారం ఉదయం కూర్మన్నపాలెం వద్దనున్న ఉక్కు దీక్షా శిబిరం వద్ద పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు నిరసన చేపట్టారు. పోలీసులు చుట్టుముట్టినా 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదాలను హోరెత్తించారు. అనంతరం అక్కడే జరుగుతున్న దీక్షా శిబిరంలో ఉక్కు కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి పోరాటానికి టిడిపి మాజీ మంత్రి బండారు సత్య నారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ గంగారావుతో

మిగతా 2లో..

మోడీ సభను బహిష్కరిస్తున్నాం : సిపిఎం, సిపిఐ ఫ్లోర్ లీడర్లు

శనివారం విశాఖలో జరుగుతున్న దేశ ప్రధాని మోడీ బహిరంగ సభను బహిష్కరిస్తున్నట్లు జివిఎంసిలో సిపిఎం, సిపిఐ ఫ్లోర్ లీడర్లు డాక్టర్ బి.గంగారావు, ఎజె.స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు వారు మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి లేఖ రాశారు. సభకు తమను రమ్మంటూ విఐపి పాస్‌లను తమరు పంపించారని, ఆ అభ్యర్థనను తిరస్కరిస్తున్నామని మేయర్‌కు స్పష్టం చేశారు. ప్రధాని విశాఖ రాక సందర్భంగా తమరి ఆధ్వర్యంలో జివిఎంసిలోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల ప్రతినిధి బందం ప్రధానిని కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేయాలని ఈ నెల 4న జివిఎంసి కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. దానికి అనుగుణంగా తమరు ప్రధాన మంత్రిని కలిసే ఏర్పాట్లు చేయలేదన్నారు. ఫలితంగా చేసిన తీర్మానానికి విలువ లేకుండా పోయిందన్నారు. 20 లక్షల మంది ప్రజలకు ప్రతినిధిగా ఉండి 'ఉక్కు' కర్మాగారంపై అనాసక్తతను వ్యక్తం చేయడం తమను తీవ్ర విస్మయానికి గురి చేసిందన్నారు. రెండో వైపు మమ్మలిని ఎక్కడ దొరికితే అక్కడ అరెస్ట్ చేయాలని ప్రభుత్వం కూడా ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఒకవైపు మోడీ సభకు విఐపిల కేటగిరీలో ఆహ్వానిస్తూ రెండోవైపు అరెస్టుల కోసం ఆదేశాలు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలపై సానుకూలంగా చర్చలు



వార్త 5లో..

మోడీ పర్యటనపై మిన్నంటిన నిరసనలు

వార్త 8లో..

గురువుల అక్రమ బదిలీలకు రంగం సిద్ధం

- త్వరలో ఉత్తర్వులు
- అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉపాధ్యాయులు బదిలీలు కోసం ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం సిఫార్సులకు పెద్దపీట వేసి అక్రమ బదిలీలకు రంగం సిద్ధం చేసింది. బదిలీలకు అర్హతలేని ఉపాధ్యాయులను కావాల్సిన చోటకు ముందుగా పంపించే ఏర్పాటుచేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మొదలుకొని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సిఫార్సుల లేఖలకు విద్యాశాఖ కమిషనర్ ఆమోదముద్ర వేశారు. కొద్ది రోజుల్లో వీరి బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు రానున్నాయి. రాష్ట్రం మొత్తంగా కొద్ది రోజుల క్రితం 390 మందితో సిఫార్సులపై ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి జాబితా తయారైంది. దీనిపై కసరత్తు చేసి 207 మంది ఉపాధ్యాయులకు కుదించారు. అక్రమ బదిలీలు జరగనున్న 207 మంది ఉపాధ్యాయుల జాబితాలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు 30 మంది వున్నారు. వీరిలో మిగతా 2లో..

రాజకీయ వేడి

మోడీ, పవన్ భేటీ
వైసిపి శిబిరంలో ఆందోళన
బిజెపి-జనసేన గేమ్‌ప్లాన్ అంటూ కొంతమంది నేతల వ్యాఖ్యలు
నేడు ఎయు వేదికగా ప్రధాని బహిరంగ సభ



ప్రధాని మోడీతో సిఎం జగన్, విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

ఒక వైపు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సాగుతోన్న కార్మికోద్యమం. మరోవైపు విశాఖ పరిపాలనా రాజధానిపై ఎడతెగని చర్చలు.. వాల్తేరు రైల్వే డివిజన్ కొనసాగించాలన్న ఉత్తరాంధ్ర ప్రజల డిమాండ్... భోగాపురం ఎయిర్‌పోర్టు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులపై ఆశగా ఎదురుచూస్తున్న విశాఖ ప్రాంతంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధికారిక పర్యటనకు రంగం సిద్ధమైంది. శనివారం ఉదయం 10 గంటలకు ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో సభ జరగనుంది. శుక్రవారం రాత్రికే విశాఖకు చేరుకున్న మోడీతో జనసేన అధినేత పవన్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖలో అరెస్టుల పర్వం

పాటు పలువురు వామ పక్షాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ దీక్షా శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసులు శిబిరంపై దాడి చేసి దీక్షల్లో కూర్చున్న 49 మందిని అరెస్టు చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్, ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులు ఉన్నారు. అరెస్టు కాబడి పెందుర్తి స్టేషన్‌లో ఉన్న నేతలను సిపిఎం నాయకులు బి.రమణి, ఐద్వా నాయకులు లావణ్య, అనంతలక్ష్మి సిఐటియు నాయకులు శంకరరావు, సింహాచలం, అప్పలనాయుడు పరామర్శించి సంఘీభావం తెలిపారు.

సిపిఎం, సిపిఐ నేతల అరెస్టులు, గృహ నిర్బంధం

కూర్మన్నపాలెంలోని 'ఉక్కు' దీక్షా శిబిరం వైపునకు వస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడును శ్రీనగర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తొలుత మల్కాపురం, ఆ తరువాత భీమునిపట్నం పోలీస్ స్టేషన్లకు తరలించారు. అలాగే సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రలను శుక్రవారం సాయంత్రం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. విశాఖలోని పలువురు ఉద్యమకారులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

అక్రమ అరెస్టులు దారుణం : సిపిఎం

కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద శాంతియుతంగా దీక్షలు చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులను, వారి కుటుంబీకులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం అత్యంత దుర్మార్గమని, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడును శ్రీనగర్ వద్ద అడ్డగించి అరెస్టుకు పూనుకోవడం దారుణమని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు పేర్కొన్నాయి. అక్రమ అరెస్టులను సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఖండించారు. విభజనతో తల్లడిల్లుతున్న ఆంధ్ర రాష్ట్రానికి విభజన చట్టం ప్రకారం ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ, పోలవరంకు నిధులు వంటి అనేక సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాటిని ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్న నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు వస్తుంటే కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం, స్టీల్‌ప్లాంట్ కోసం పోరాడుతున్న వారిపట్ల పోలీసు బలగాలను ప్రయోగించి అరెస్టులు చేయించడం సిగ్గు చేటన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న వారిని అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధి వుంటే రేపు సభా వేదికపై నరేంద్ర మోడీ చేత స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రకటింపజేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజా క్షేత్రంలో దోషులుగా నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. అక్రమ అరెస్టులను విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఖండించింది. ఈ మేరకు ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతటి నిర్బంధం విధించినా శనివారం కూడా నిరసనలు జరిపి తీరుతామన్నారు. అరెస్టులను పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

రాజకీయ వేడి

కళ్యాణ్ 30 నిమిషాల పాటు సమావేశం అయ్యారు. బయటకొచ్చినాక పవన్ మీడియా సమావేశంలో ఒక్కనిమిషం మాత్రమే మాట్లాడడం విశేషం. ఈ భేటీతో వైసిపి శిబిరంలో ఆందోళన రగుల్కొన్నట్టయింది. సభ విజయవంతానికి వైసిపి శ్రేణులు కష్టిస్తున్న క్రమంలో బిజెపి అక్కసుతో వ్యవహరిస్తూ పవన్‌ను అర్ధాంతరంగా మోడీని కలిసేలా ఉసిగొలిపిందంటూ వైసిపిలో కొంతమంది తాజాగా వ్యాఖ్యానిస్తున్నారు. పైగా సభా వేదికపై ఎవరెవరు ఉండాలన్న అంశంపైనా బిజెపియే పెత్తనం చేసిందన్న ఆవేదన వైసిపి శ్రేణుల నుంచీ వినిపిస్తోంది. 'బిజెపి-జనసేన' గేమ్‌ప్లాన్ అంటూ ఇంకొంతమంది వ్యాఖ్య. ఏదిఏమైనా విశాఖ వేదికగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య రాజకీయ వైరం మరింత పెరుగుతోంది. అయితే ఇదంతా ప్రజా సమస్యలు, కార్మికుల గుండె చప్పుడును బట్టి ఈ రాజకీయాలు కాకుండా వారి వారి సొంత అజెండాలు, ప్రాపకాల ప్రాతిపదికనే రగుల్కొంటున్నాయి.

సభా వేదికపై 9 మందికే అవకాశం

ప్రధాని మోడీ, ఎపి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించనున్న ఎయు గ్రౌండ్స్ వేదికపై 9 మందికే ఛాన్స్ దొరకడం విశేషం. విశాఖ నుంచి వైజాగ్ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, బిజెపి ఎంఎల్‌సి పివిఎన్ మాధవ్ ఉన్నారు. నెల్లూరు ఎంఎల్‌సి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, కేంద్ర మంత్రి అశ్విన్‌కుమార్ ఉండనున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ 10.50 నుంచి 11.30 గంటల వరకూ సుమారు 40 నిమిషాలు ప్రసంగించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 10.25 నుంచి 10.32 నిమిషాల వరకూ అంటే 7 నిమిషాలే ప్రసంగించనున్నారు. 2 లక్షల మందిని సభకు తరలించాలని వైసిపి శ్రేణులు తీవ్ర ప్రయత్నాల్లో నిమగ్నం అయ్యాయి.

గురువుల అక్రమ బదిలీలకు రంగం సిద్ధం

అధ్యాపకులు, కెజిబివి, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులున్నారు. ఏడాదిన్నర సర్వీసు పూర్తికాని కొంతమంది ఉపాధ్యాయులు తిరిగి కావాల్సిన ప్రాంత పాఠశాలకు వచ్చేందుకు బదిలీకి సిఫార్సు చేసుకున్నారు. 8 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న కొంతమంది ఉపాధ్యాయులు తమ పలుకుబడిని ఉపయోగించుకొని సాధారణ బదిలీల నుంచి తప్పించుకొనేందుకు పక్కపక్క స్కూళ్లకు పరస్పర బదిలీలు పెట్టుకున్నారు. పెందుర్తి మండలంలోని ఆరుగురు అదే మండలంలోని ఇతర పాఠశాలలకు వెళ్లేందుకు, చినగదిలి మండలంలోని నలుగురు ఉపాధ్యాయులు ఇదే మండలంలోని వేర్వేరు పాఠశాలకు వెళ్లేందుకు పరస్పర బదిలీలకు పెట్టుకున్నారు. విజయనగరం నుంచి ముగ్గురు, తూర్పుగోదావరి నుంచి ఇద్దరు విశాఖపట్నం జిల్లాకు బదిలీకి పెట్టుకున్నారు. ఒకరు విశాఖ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీకి పెట్టుకున్నారు. ఇలా నచ్చిన చోటకు సాధారణపై బదిలీలకు ముందే కొంతమది ఉపాధ్యాయులను ప్రభుత్వం బదిలీలు చేస్తే, బదిలీ అర్హత కల్గిన ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

దొడ్డి దారి బదిలీలు నిలుపుదల చేయాలి: యుటిఎఫ్

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం ప్రయత్నించడం, కౌన్సిలింగ్ ప్రక్రియను తుంగలో తొక్కడమే. జిఓ 117 పేరుతో ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ జరుగుతున్న సమయంలో బదిలీలు కూడా జరుగుతాయని ఉపాధ్యాయులు ఆశిస్తున్న తరుణంలో ప్రభుత్వం అక్రమ బదిలీలకు పాల్పడ్డం ఉపాధ్యాయులకు తీరని నష్టం జరుగుతుంది. జిల్లా విభజన నేపథ్యంలో సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లాలనుకున్న అర్హులైన ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం కలుగుతుంది. కౌన్సిలింగ్‌తో నిమిత్తంలేకుండా జరుగుతున్న బదిలీల ప్రక్రియను నిలిపివేయాలి.

– గొంది చినబ్బాయ్,
అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి

జగనన్న ఇళ్ల పేరుతో వేల కోట్ల దోపిడీ

ప్రజాశక్తి- కలెక్టరేట్ : జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో అధికార వైసిపి నేతలు వేలకోట్ల దోపిడీకి పాల్పడ్డారని, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకరరావు ఆరోపించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.

రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కలెక్టరేట్ : ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీపై విశాఖ సభలో ప్రధాని మోడీ దేశ యువతకు సమాధానం చెప్పాలని డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పలుచోట్ల డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపికి ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, ఇతర విభజన హామీల అమలుపై తెలుగు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణపై టిడిపి మెరుపు నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం టిడిపి కార్యాలయంలో మెరుపు నిరసన చేశారు. సేవ్ స్టీల్ ప్లాంట్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ,జగన్ సర్కారు సాయంతోనే ఉక్కు ప్రయివేటీకరణ జరుగుతోందన్నారు. దీనిపై బిజెపి నేతలే అడగాలన్న ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, మైనార్టీ సెల్ విశాఖ అధ్యక్షులు షేక్ రెహమతుల్లా, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు అబ్దుల్ అనీఫ్ పాల్గొన్నారు.

వైసిపి కుంభకోణాలపై మోడీ దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్: విశాఖలో వైసిపి నేతల కుంభకోణాలపై ప్రధాని దృష్టి పెట్టాలని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ. జగన్,విజయ సాయిలు తమ ఇంటి పేర్లను కుంభకోణాల రెడ్డిగా పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. మోడీపై టిడిపికి వ్యక్తిగత విభేదాలు లేవన్నారు. మోడీ పర్యటనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మోడీ సభలో మూడు రాజధానులకు మద్దతుగా వైసిపి ప్లకార్డులను ప్రదర్శించేలా ప్లాన్ చేస్తోందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకష్ణబాబు పాల్గొన్నారు.

పోర్టు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్: విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టులను ప్రైవేటీకరణ చేయరాదంటూ శుక్రవారం పోర్టు ఉద్యోగులు డిమాండ్స్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ప్రధాని మోడీ దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సాంబమూర్తి, కె.సత్య నారాయణ, ఈశ్వరరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారుల కోసం

20న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పద్మనాభం : తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం ఈనెల 20న పద్మనాభం జంక్షన్‌లోని బంగారమ్మ దేవాలయం వద్ద రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కె.రాంబాబు తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రతి మూడు వారాలకోసారి తప్పనిసరిగా రక్తమార్పిడి చేస్తేనే గానీ జీవనం సాధ్యం కాని తలసేమియా బాధిత పిల్లల కోసం మేమున్నామంటూ పలు గ్రామాల్లోని యువకులు, స్వచ్ఛంద సేవాసంఘాల ప్రతినిధులు ఈ మహాయజ్ఞంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా తలసేమియా బాధితులకు బాసటగా నిలవాలని కోరారు. జిల్లాలో 98 మంది తలసేమియా వ్యాధితో బాధపడు తున్నారన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక బంగ్లామెట్ట వద్ద దుర్గాలమ్మ, అయ్యప్ప స్వామి పీఠం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రముఖులు కొప్పల రమేష్ ఆర్థిక సాయంతో శుక్రవారం 900 మందికి అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు కె.అప్పారావు, టి సూరిబాబు, కొప్పల కృష్ణ, మాల్యాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో గ్రంథాలయం కార్యదర్శి డివి సూర్యారావు ఆధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్, ఎకనామిక్స్, పాలిటిక్స్ అడ్మినిస్ట్రేషన్ హిస్టరీ, పలు అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో బివికె కాలేజీ, ఉమెన్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం రోజున బహుమతులను అందజేస్తామని సూర్యారావు తెలిపారు.

గాయపడిన మేకల కాపరి మృతి

ప్రజాశక్తి-పద్మనాభం: చెట్టు నుంచి జారిపడి, తీవ్రగాయాలతో విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ ఎస్‌సి కాలనీకి చెందిన ఎస్.అప్పారావు (50) అనే మేకల కాపరి శుక్రవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో ఆసుపత్రిలోనే మృతి చెందినట్లు భార్య ఎస్.సత్యవతి పోలీసులకు తెలియజేసింది. ఈనెల తొమ్మిదో తేదీన మేకల మేత కోసం చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి కిందన పడ్డాడు. తీవ్ర గాయాలతో కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. దీనిపై భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ అదృశ్యం

ప్రజాశక్తి -కంచరపాలెం :లారీ డ్రైవర్ అదృశ్యంపై ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు కంచరపాలెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్ర సోలాపూర్ ప్రాంతానికి చెందిన సాగర్ (43) ఈనెల 7 వ తేదీన ఉల్లిపాయల లోడుతో విశాఖ జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చాడు. మరుసటి రోజు రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో మంచినీటి కోసమని వెళ్లిన సాగర్ రోజులు తిరిగి లారీ వద్దకు చేరుకోలేదు. దీనిపై ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు రాముని నాయుడు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిఐ. ఎస్. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్.సి రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.



లారీ డ్రైవర్ సాగర్

పలుచోట్ల జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంవిఆర్ కళాశాలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి రామారావు మాట్లాడుతూ, దేశ మొట్టమొదటి విద్యాశాఖమంత్రి అబ్దుల్ కలాం ఆజాద్ విద్యాసంస్కరణలో ఎన్నో మార్పులు తెచ్చారని, అందుకే ఆయన జయంతిని జాతీయ విద్య దినోత్సవంగా జరుపుకుంటున్నా మన్నారు. డాక్టర్ సిహెచ్.రామ్ సన్యాసిరావు ,ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి. కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై ఈశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్ఎస్‌కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింహాచలం: స్థానిక శాఖాగ్రంథాలయంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని లైబ్రేరియన్ ఎన్‌వి.మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా దేశ



నక్కపల్లిలో నివాళులర్పిస్తున్న జనార్థన్



ఎంవిఆర్ కాలేజీలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్ సన్యాసిరావు

మొదటి విద్యాశాఖమంత్రి అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రీడర్స్ ఫోరం అధ్యక్షులు బీబీ రాజేంద్రప్రసాద్, చిన్నారావు, మధు, శంకర్, ఏడుకొండలు, శ్రీను, బంగార్రాజు, వరలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు

నక్కపల్లి : చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ తొలి విద్యా మంత్రిగా ఆజాద్ సేవలను లైబ్రేరియన్ కె.జనార్దన్ కొనియాడారు.

నర్సీపట్నం టౌన్ :భారతరత్న డాక్టర్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ సేవలను ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించని రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సుతోపాటు గుర్తింపు రద్దు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రెండో శనివారం సెలవు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇటీవల ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలతో కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో సమావేశంలో దీనిపై కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. కచ్చితంగా నిబంధనల అమలుకు అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు కమిషన్ సూచనలు చేసిందన్నారు. పూర్తి స్థాయిలో అమలుకు నిరంతర పర్యవేక్షణ జరపాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించిందన్నారు. కమిషన్ ప్రతినిధులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పాఠశాలల నిర్వహణలో లోపాలను గుర్తించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే, తగు ఆధారాలతో apscpcr2018@gmail.comకు గానీ, సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారికిగానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం


ప్రజాశక్తి- మధురవాడ : గీతం వైద్య కళాశాల, ఆసుపత్రి జాతీయ సేవా విభాగం, యూత్ ఫర్ సేవా స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలీలోని ఐసిడిఎస్ బాలసదనంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది బాలలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందజేసారు. విద్యార్థుల సేవా నిరతిని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమణారావు అభినందించారు. యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పుండరీ కాక్షయ్య తమ సంస్థ కార్యకలాపాలను వివరించారు.



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న గీతం ప్రతినిధులు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలస పంచాయితీ, గొల్లల తాళ్లవలసలో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ బోని జగ్గమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుద్ధరాజు సత్యనారాయణ రాజు (సింగపూర్ బుజ్జి రాజు), ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైసిపి నేతలు అక్కరమాని అప్పలనాయుడు, వేణురాజు, గొలగాని సన్యాసిరావు, బోని సన్నిబాబు, చిన్ని రాజు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ఇళ్ల నిర్మాణాలపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలోనే అతిపెద్ద స్కాం జగనన్న కాలనీలు, టిడ్కో ఇల్లు నిర్మాణాలపై ఈనెల 12, 13,14 తేదీలలో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల తెలిపారు. శుక్రవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, జగనన్న ఇళ్లు, పేదలకు కన్నీళ్లు చందాన ఈ పథకం అమలు జరుగుతోందని, దీనిపై సమగ్ర పరిశీలన జరిపి అక్రమాలు, సమస్యలను వెలుగులోకి తెస్తామన్నారు. దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శేఖర్ శ్రీనుబాబు. ఎన్ఎన్. నాయుడు, పోతిన అనురాధ, మజ్జి శ్రీను సంతోషనాయుడు పాల్గొన్నారు.

కొనసాగిన అప్పన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం తెరిచి లెక్కించిన విషయం తెలిసిందే. మిగిలిన హుండీలను శుక్రవారం దేవస్థానం ఇన్‌ఛార్జి ఇఒ త్రినాధరావు సమక్షంలో తెరిచి లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకలు నగదు రూ62,53,886, బంగారం 40.400 గ్రాములు, నాలుగు కేజీల 880 గ్రాముల వెండితోపాటు వివిధ దేశాలకరెన్సీ నోట్లు లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

కేంద్ర కారాగారంలో ఖైదీ ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో శిక్ష పడ్డ ఖైదీ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఎం.శ్రీనివాస్ (32) ఒక హత్యా నేరంపై విశాఖ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. గురువారం ఉదయం బ్యారల్‌లోని కిటికీ ఊచలకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన జైలు సిబ్బంది ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్ రాజు సంఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా మృతుడు శ్రీనివాస్ గతంలో ఒక హత్యా నేరంపై మహారాష్ట్ర యారవాడ జైల్లో జీవితఖైదీగా శిక్ష అనుభవించాడు. తాజాగా విశాఖ జిల్లాలోనూ ఒక హత్యా నేరంపై మూడేళ్ళ క్రితం రిమాండ్ ఖైదీగా విశాఖ కేంద్రకారాగారానికి తరలించారు. ఇక్కడి హత్యకేసులో ఈ నెల 7న కోర్టు వెలువరించిన తీర్పులో ఆయనకు జీవిత ఖైదు విధించారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నక్కపల్లి: మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన మహిళ పిల్లి నాగమణి (37) ఉరేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. ఉద్దండపురం సమీపంలో గల మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతున్న మహిళను చూసిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. సిఐ నారాయణరావు, ఎస్ఐ శిరీష పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని నాగమణిగా గుర్తించారు. క్లూస్ టీం పరిశీలించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతురాలికి తల్లిదండ్రులు లేరు. అక్కాచెల్లెళ్ళు, అన్నదమ్ముడు ఉన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి - ఎస్.రాయవరం : మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో ఒకే రోజు రెండు వేర్వేరు దేవాలయాల్లో చోరీలు జరిగాయి. తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శివాలయంలలో దొంగలు పడ్డారు. ఈ చోరీలో పది తులాలు వెండి, పావు తులం బంగారం కాసుల పేరు చోరీకి గురయ్యాయి. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ హుండీలోని సుమారు రూ.25వేలు, శివాలయంలోనిసుమారు రూ.15 వేల నగదు చోరీకి గురయినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి క్లూస్ టీంను రంగంలోకి దించారు. సంఘటనా స్థలాన్ని గ్రామసర్పంచ్ కర్రి సత్యనారాయణ, గ్రామపెద్దలు పరిశీలించారు.

యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి పద్మనాభం : మండలంలోని రేవుడి పంచాయతీ, అన్నం పేట గ్రామానికి చెందిన పి శంకరరావు (24) హిమోఫిలియా వ్యాధితో మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీన తన ఇంటి ముందు బైక్ స్టాండ్ వేస్తుండగా, అదుపు తప్పి బైక్ తనపై పడడంతో గాయపడిన శంకరరావుకు, హిమోఫిడియా వ్యాధితో రక్తస్రావం అదుపులోకి రాకపోవడంతో చికిత్స కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పద్మనాభం ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి -కంచరపాలెం : విద్యార్థిని అదృశ్యంపై ఆమె తల్లిదండ్రులు శుక్రవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఈనెల 9న ఉదయం కాలేజీకి వెళ్లిన కంచరపాలెం ప్రాంతానికి చెందిన నూకాంబిక (19) తిరిగి ఇంటికి రాకపోవడంతో, ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో కుటుంబీకులు వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో యువతి తల్లి గుమ్మడి దేవి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ ఎస్. విజయ్‌కుమార్ నేతృత్వంలో హెచ్‌సి రమేష్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆచూకీ తెలిసినవారు కంచరపాలెం పోలీసులను సమాచారమివ్వాలని కోరారు.



గుమ్మడి నూకాంబిక

వద్దంటే బోర్లు వేస్తారెందుకు..!

- సమృద్ధిగా కుళాయి నీరుంటే, ఉప్పునీటి బోర్లు ఎందుకు?
- పెద్దనాగమయ్యపాలెం గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ గ్రామంలో తాగునీటి బోర్లు వేయొద్దంటూ మండలంలోని పెద నాగమయ్య పాలెం గ్రామస్తులు శుక్రవారం గ్రామంలోనే ఆందోళన చేశారు. గ్రామ పెద్దలు గరికిన పరశురాం, దూడ ధనంకొండ, పోలయ్య, బడే ఎల్లారావు తదితరులు మాట్లాడుతూ, ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు లేకున్నా, జలజీవన్ మిషన్ కింద ఎవరి ప్రయోజనాల కోసం బోర్లు వేస్తున్నారని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ప్రశ్నించారు. బోర్లు వేయడం వల్ల ఉప్పు నీరు వస్తుందని, ఇదే విషయాన్ని గతంలో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అప్పట్లో ఎంపిగా ఉన్న డాక్టర్ కె.హరిబాబు తమ గ్రామాన్ని దత్తత తీసుకుని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఇంటింటికీ అప్పట్లోనే తాగునీటి కుళాయిలు వేశారన్నారు. తాగునీటి అవసరాలు తీర్చాలన్న చిత్తశుద్ధి ఉంటే, తమ పంచాయతీ పరిధిలోని పాతపాలెం, జీరుపాలెం, చిన నాగమయ్య పాలెం గ్రామాల్లో బోర్లు వేయాలని సూచించారు. బోర్ల ఏర్పాటును పెద నాగమయ్యపాలెం గ్రామస్తులు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తుంటే, అధికారులు మొండిగా బోర్లు వేస్తామంటూ ముందుకు రావడం సరికాదని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామస్తులు జి అప్పయ్య తాత, ఎం ప్రసాద్, అచ్యుతరావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న పెదనాగమయ్యపాలెం వాసులు

'దిశ' ఎసిపిగా వివేకానంద


ప్రేమ బాధ్యతలు స్వీకరిస్తున్న ఎసిపి వివేకానంద

ప్రజాశక్తి -మధురవాడ : దిశ పోలీస్ స్టేషన్ ఎసిపిగా సిహెచ్.వివేకానంద శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ప్రేమ కాజల్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త ఎసిపి వివేకానంద మాట్లాడుతూ సిబ్బంది సహకారం, సమన్వయంతో సమస్యలతో వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఫిర్యాదుదారుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తూ, ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని సిబ్బందికి సూచించారు. దిశ స్టేషన్‌కు వచ్చిన కేసులను వీలైనంత వరకు కౌన్సిలింగ్ ద్వారా సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తప్పనిసరి పరిస్థితుల్లోనే కేసులు నమోదు చేయాలన్నారు ఈ సందర్భంగా కొత్త ఎసిపికి స్థానిక పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు.

పిల్లల చదువు, ప్రవర్తనపై శ్రద్ధ అవసరం


మాట్లాడుతున్న కాలేజి ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్

ప్రజాశక్తి -ములగాడ: పిల్లల చదువు, ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు ఎంతో శ్రద్ధ వహించాలని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచగలమన్నారు. అధ్యక్షోపన్యాసం చేసిన కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు మానవతా విలువలు, సామాజిక దృక్పథం ఎంతో అవసరమన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆలపించిన గేయాలు ఆహూతులను అలరించాయి.

చందకలో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలు


రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శైలజ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని చందక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ కోరాడ శైలజ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 57 మందికి వైద్య సేవలు అందించారు బీపీ, సుగర్, హెచ్‌బి, ఇతర రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ప్రతిఒక్కరి ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ కనబరచడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమన్నారు. మధ్యాహ్నం పాఠశాల అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చందక సర్పంచ్ బంక శ్రీను, ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ ఐ.గోవిందరావు, సిహెచ్ఓ పావని, ఎఎన్ఎం మంగవేణి, ఆశ వర్కర్లు లక్ష్మి, అనసూయ, రమణమ్మ పాల్గొన్నారు

ఎన్ఎస్‌టిఎల్‌లో ఉచిత దంత వైద్యశిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, పాల్గొన్న ఎన్ఎస్‌టిఎల్ ప్రతినిధులు, వైద్యులు

ప్రజాశక్తి- కరాస : విశాఖపట్నంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లాబరేటరీలో శుక్రవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వై శ్రీనివాసరావు ప్రారంభించిన దంత వైద్య శిబిరంలో ది స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ వైద్యులు డాక్టర్ వై.రాజేష్‌కుమార్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, ఇతర వైద్యబృందం పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వర్క్స్ కమిటీ సభ్యులు చైర్మన్ డాక్టర్ మను కోరిల్ల, సత్యవాణి, సిహెచ్ జయరావు, జి నాగభూషణం, ఎస్‌కె.సాహు, సిహెచ్ చంద్రశేఖరరావు, అనిల్ కుమార్, జనకరాజ్, సీనియర్ శాస్త్రవేత్తలు పివిఎస్ గణేష్ కుమార్, సిహెచ్ విఎస్ఎన్ మూర్తి, మూర్తి కృష్ణకుమార్, డాక్టర్ జివి కష్ణకుమార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


వార్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : ఐదోవార్డులో పారిశుధ్యం, డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మొలి హేమలత తెలిపారు. శుక్రవారం వార్డు పరిధిలోని మారికవలస రాజీవ్ గృహకల్పకాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కాలనీలలో పర్యటించారు. స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యుజిడి పైపులైన్లు పూర్తిగా నిండిపోవడంతో ఎక్కడికక్కడే దుర్గంధ సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆమె దృష్టికి తేగా, వెంటనే స్పందించి, సంబంధిత జివిఎంసి యుజిడి, శానిటేషన్ సిబ్బందిని అక్కడకు రప్పించి, యుద్ధప్రాతిపదికను యుజిడిలోని దుర్గంధం తొలగించే చర్యలు చేపట్టారు. సమస్య శాశ్వత పరిష్కారానికి జివిఎంసి కౌన్సిల్‌లో చర్చించడంతోపాటు జిల్లా కలెక్టర్, కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకెళ్లి యుజిడి, మురుగుకాలువలు, కల్వర్టుల సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశంతో విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో జాతీయ లోక్‌అదాలత్ జరగనుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి తెలిపారు. దీన్ని జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకొని, న్యాయపరమైన సమస్యలను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఇప్పటికే జిల్లాలోని పోలీస్ అధికారులతోనూ, జీవీఎంసీ, బ్యాంక్, ఇన్సూరెన్స్ వంటి తదితర సంస్థలతోనూ అవగాహన సదస్సులు నిర్వహించి ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి చొరవ చూపినట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారానికి సంసిద్ధతను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులిక్రిష్ణ తెలిపారు.

ప్రధాని బహిరంగ సభ ఏర్పాట్లుపై సమీక్ష



మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 12న ఉదయం 9గంటలకు నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి బహిరంగ సభ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ ముఖ్య నాయకులు,అధికారులతో సమీక్ష నిర్వహించారు. బహిరంగ సభకు ఉత్తర నియోజకవర్గం నుండి భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్, 48వవార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

మోడీ బహిరంగ సభకు తరలిరండి

ప్రజాశక్తి- గాజువాక : ఈనెల 12న ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని మోడీ, సిఎం జగన్ పాల్గొనే బహిరంగసభకు భారీగా జనాలు తరలివచ్చి విజయవంతం చేయాలని 74వ వార్డు కార్పొరేటర్, వైసిపి విశాఖ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఔ ఈ మేరకు ముఖ్య నాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించే ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపేందుకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించాలి

- ఆంధ్రా ప్రజలు సంతోషించేలా ప్రధాని మోడీ వరాలివ్వాలి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్


మాట్లాడుతున్న తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్

ప్రజాశక్తి- కలెక్టరేట్ : విశాఖపట్నం వచ్చిన ప్రధాని మోడీ శనివారం పాల్గొనే బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా సంతోషించే విధంగా వరాలు ఇవ్వాలని, ప్రధానంగా అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్ విజ్ఞప్తి చేశారు. ఐదు ప్రధాన డిమాండ్ల సాధనకు శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లి, విజయనగరం పట్టణంలోని పైడితల్లమ్మ ఆలయం, విశాఖలోని సంపత్ వినాయక ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని స్పష్టత ఇవ్వాలన్నారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు.విశాఖ రైల్వే జోన్ హామీ నెరవేర్చాలన్నారు. 2019 నుంచి నేటి వరకు విశాఖలో జరిగిన భూలావాదేవీలపై సిబిఐతో విచారణ జరిపించాలన్నారు. వైసిపి పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీనిపై ప్రత్యేక కమిటీ వేసి, సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని పాల్గొనే సభకు ప్రతిపక్షాలను పిలవకుండా కట్టడి చేయడం మంచి సాంప్రదాయం కాదని, ప్రజలు తమ కష్టాలను స్వేచ్ఛగా ప్రధానికి చెప్పుకునే అవకాశం కల్పించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పాదయాత్ర

తగరపువలస : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ శుక్ర వారం పాదయాత్ర చేశారు. తగరపువలస జంక్షన్ నుంచి సంగివలస పోలమాంబ గుడి జంక్షన్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖ నగరానికి వస్తున్న ప్రధాని మోడీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో మట్టి, నీరు తెచ్చి శంకుస్థాపన చేసిన అమరావతిని రాష్ట్రానికి ఏకైక రాజధానిగా ప్రకటించి, పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. 2019 నుంచి విశాఖలో జరిగే భూకొనుగోళ్లపై సిబిఐతో విచారణ జరపాలని కోరారు. విశాఖలో చోటుచేసుకున్న అక్రమాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు ముద్రించిన కరపత్రాలను స్థానికులకు ఆయనే స్వయంగా పంపిణీ చేశారు.

ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్యలపై సానుకూలంగా చర్చలు..

★ 4నెలల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ

★ 17 నాటికి హామీలపై స్పష్టత

★ పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామన్న నిర్వాసితులు



చర్చల్లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, నిర్వాసిత మత్స్యకారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని రాంబిల్లి వద్ద గల నావికాదళ ప్రత్యామ్నాయ స్థావరం (ఎన్ఎఓబి) నిర్వాసితుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో సానుకూలంగా చర్చలు జరిగాయి. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి సమక్షంలో జరిగిన ఈ చర్చల్లో యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు, టిడిపి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, నిర్వాసిత మత్స్యకార నాయకులు, ప్రభావిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. మూడు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో..., 2005 నుండి 2018 వరకు వివిధ సందర్భాల్లో నిర్వాసితులు, జిల్లా అధికారుల మధ్య జరిగిన ఒప్పందాలను నేటికీ అమలు చేయలేదని నిర్వాసితులు తమ గోడును వెళ్లబుచ్చారు.

నిర్వాసితుల డిమాండ్లు

జెట్టీ నిర్మాణమయ్యే వరకు సాంప్రదాయ మత్స్యకారులు వరహా, శారద నదుల్లో వేట చేసుకొనేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు వేటకు వెళ్లేందుకు గేట్లు ద్వారా అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని, ఎన్ఎఓబి నిర్వాసిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, చిన్న కళవాలపల్లి, కొత్తపట్నం, గోవిందపాలెం, వాడరాంబిల్లి తదితర గ్రామాలను నేవీ ప్రభావిత గ్రామాలుగా గుర్తించి ప్యాకేజీ అమలు చేయాలని, బంగారమ్మపాలెం, కొత్త పట్నం, వాడనర్సాపురం, కెజె. పాలెం గ్రామస్తులకు సబ్ గేట్లు తెరవాలని, పెండింగ్ ప్యాకేజీలు అమలు చేయాలని, శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని, స్థానికులకు నిర్మాణ పనుల్లో 75శాతం ఉపాధి కల్పించాలని, ఈ గ్రామాలన్నింటికీ ఆర్ కార్డులు మంజూరు చేయాలని, విద్య, వైద్యానికి సిఎస్ఆర్ ఫండ్స్ కేటాయించాలని, సొసైటీ భూములకు నష్టపరిహారం చెల్లించాలని తదితర డిమాండ్లతో పాటు 25 అంశాలపై చర్చలు జరిగాయి.

పై అంశాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ నిబంధనలకు లోబడి ఈ సమస్యలను 4 నెలల్లోగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 17 నాటికి ఈ అంశాలన్నింటిపై మినిట్స్ రూపంలో తెలియజేస్తామని చెప్పారు. ఈ అంశాలపై జాయింట్ కలెక్టర్, మత్స్యశాఖ జెడి, నర్సీపట్నం, అనకాపల్లి ఆర్‌డిఒలతో కమిటీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని, అధికారులు, 9 నిర్వాసిత పంచాయతీల మత్స్యకార నాయకులతో మరో సబ్ కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, కొత్తపట్నం, వాడనర్సాపురం, కొత్తపేట, చిన్నకలవలపల్లి, గోవిందపాలెం, బంగారమ్మపాలెం సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, కె.రామారావు, వానపల్లి అరుణలత, శ్రీనివాసరావు, దేముడు, ఎం.శ్రీను, ఎంపిటిసిలు డి.నరసింహులు, సిహెచ్.పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, ఎర్రయ్య, అప్పలరాజు, శ్రీను, నాగేశ్వరరావు, కాసులు, మాజీ ఎంపిటిసిలు రామకృష్ణ, దేముడు, ఎన్ఎఓబి కాలనీ నాయకులు ప్రసాద్, సిపిఎం మండల కన్వీనర్ జి.దేముడు నాయకులు సిహెచ్.గంగరాజు, వాడపాలెం పెద్దలు జి.అప్పారావు, సిహెచ్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని స్పందించాలి : సిపిఎం

అనకాపల్లి : విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్యలపై స్పందించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. దేశానికి రక్షణ కల్పించే నేవీ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల జీవితాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఎఓబి రాకముందు ప్రశాంతంగా ఉన్న నిర్వాసిత మత్స్యకారుల జీవనం ఇప్పుడు పలు సమస్యలతో అల్లకల్లోలమైందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఎఓబి నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత, నిర్వాసిత మత్స్యకారుల కోసం జెట్టీ నిర్మాణానికి, వారి సమస్యల పరిష్కారానికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రక్షణ రంగానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి డబ్బులు ఖర్చు చేయకుండా వారిని గాలికొదిలేయడం దారుణమన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి ప్రధాని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 9 పంచాయతీల మత్స్యకారులు ఇదే ఐక్యతో సమస్యలు పరిష్కారమయ్యేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

కొనసాగిన ఆందోళన

రాంబిల్లి : రాంబిల్లి నేవీ మెయిన్ గేట్ ముందు నిర్వాసిత మత్స్యకారులు చేపట్టిన ఆందోళన నేటికీ 12వ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కూండ్రపు సోమునాయుడు వీరి ఆందోళనకు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. గ్రామాలను తరలించే వరకు ఆధార్ కార్డు అనుమతితో చేపలు వేటకు, నిర్మాణ పనులకు అనుమతి ఇస్తామని హామీకి తూట్లు పొడిచి గేట్లు మూసివేయడం, గుంతలు తవ్వడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో రాంబిల్లి మండలంలోని 8 పంచాయతీల నిర్వాసితులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎన్ఎఓబి నిర్వాసిత మత్స్యకారులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ మానుకోవాలి

టిడిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు నాగజగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ మానుకోవాలని టిడిపి అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.3 లక్షల కోట్ల ఆస్తులను స్టీల్ ప్లాంట్‌ను రూ.30 వేల కోట్లకు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ కోసం 32 మంది ప్రాణాల త్యాగం, 16 వేల మంది రైతుల భూముల త్యాగం చేశారని గుర్తు చేశారు. పోస్కో వంటి విదేశీ కంపెనీలకు గనులు కేటాయించిన కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థగా నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని ప్రధాని మోడీ తక్షణమే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి తన కేసుల మాఫీ కోసం కేంద్రంతో కొమ్ముక్కై రాష్ట్ర అభివృద్ధికి తిలోదకాలిచ్చారని ఆరోపించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు విల్లూరి రమణ బాబు, డివివి అప్పారావు పాల్గొన్నారు.

ప్రధాని ప్రకటన చేయాలి

అనకాపల్లి : ప్రధాని నరేంద్ర మోడీ విశాఖలో పర్యటనలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయమని ప్రకటన చేయాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు బుద్ద రాజేష్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలు సేవ్ విశాఖ స్టీల్ ప్లకార్డుల ప్రదర్శన చేయాలన్నారు.

ప్రత్యేక హోదా ఇవ్వాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కశింకోట : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. కశింకోటలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి నిరసన తెలియజేయాలన్నారు. ప్రధాన సభ కోసం వైసిపి నాయకులు జనసమీకరణ చేయడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కత్తిర శ్రీధర్, కాళ్ళ సత్యనారాయణ, సూరిశెట్టి ఆది సూరి అప్పారావు, బాల మురళీ పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక ఫైర్ ఆఫీసు కోలనీ పాఠశాల నాడు నేడు పథకం నిధులు రూ.7.50 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపిపి బోదెపు గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన గదులు, విద్యుత్తు, బల్లలు, ఫ్యాన్‌లు, మంచినీరు, మరుగుదొడ్లు మొదలైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కౌన్సిలర్ కిరణ్, మరిడేశ్వరరావు, వైసిపి నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, నాయుడు, పాఠశాల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న విసి సూర్యప్రకాష్

ఈక్విటీ లావాదేవీలపై వర్క్ షాప్

ప్రజాశక్తి- సబ్బవరం : సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ సెంటర్ ఫర్ బిజినెస్ అండ్ కమర్షియల్ లా ఆధ్వర్యాన జాబితాలో లేని కంపెనీలలో ఈక్విటీ లావాదేవీలు అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.సూర్య ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాలలో ఆర్థికాభివృద్ధి అనేది కార్పొరేట్ చట్టాల అభివృద్ధికి, ఔచిత్యానికి దారితీసిందన్నారు. కార్పొరేట్ రంగంలో వృద్ధి, రోజురోజుకు దాని పరిధి విస్తృతమవుతోందని, కార్పొరేట్, సెక్యూరిటీల చట్టాలను అభ్యసించాలని సూచించారు. ముఖ్య వ్యక్తులుగా పాల్గొన్న అమర్‌చంద్ మంగళదాస్ సంస్థ భాగస్వాములు విశక్ అబ్రహం, సౌరవ్ సమద్దర్ మాట్లాడుతూ ఈక్విటీ, అప్పు, లావాదేవీలలో పార్టీల హక్కులు, బాధ్యతలపై ప్రభావం, షేర్ల కొనుగోలు ఒప్పందాల కాన్సెప్ట్‌ల యొక్క ముఖ్య అంశాలు, కంపెనీపై దాని సమస్యలు, కంపెనీలు జారీ చేసిన సెక్యూరిటీల నియంత్రణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్ రావు, అకడమిక్ అఫైర్స్ అండ్ రీసెర్చ్ అండ్ ఫ్యాకల్టీ అడ్వైజర్, సిబీసీఎల డైరెక్టర్ దయానంద మూర్తి, సిబీసీఎల ఫ్యాకల్టీ అడ్వైజర్ బయోలా కిరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్ తదితరులు

రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - దేవరాపల్లి : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో విశాఖలోని డాక్టర్ ఎల్.బుల్లయ్య జూనియర్ కళాశాలలో క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెనుగుపూడి గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు అండర్ -19 హ్యాండ్ బాల్ పోటీల్లో పి.గోపీచంద్, వెయిట్ లిఫ్టింగ్‌లో బి.శ్యామ్, పి.దినేష్, పవర్ లిఫ్టింగ్‌లో ఎన్.ఆనంద్, యోగాలో శివ మహేష్, హేమంత్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో 16 మంది ఎంపికైనట్లు కళాశాల పిడి బి.రాంబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విశాఖపట్నం అనకాపల్లి జిల్లాల కోఆర్డినేటర్ ఎస్.రూపవతి, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్రనాథ్, పిఈటీ జి.తరుణ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

నాన్న స్ఫూర్తితో సూక్ష్మ కళ కొనసాగింపు

ప్రజాశక్తి - యలమంచిలి : తన తండ్రి (రమణ) జాతీయ స్థాయిలో లక్కబొమ్మల్లో గొప్ప కళాఖండాలు సృష్టించి పేరుపొందారని, ఆయన స్ఫూర్తితో తాను కూడా సృజనాత్మకత జోడించి 4 సెంటీమీటర్ల శ్రీకృష్ణుడి బొమ్మను రూపొందించినట్లు ఏటికొప్పాకకు చెందిన శ్రీశైలపు వినయ్ శుక్రవారం విలేకర్లకు తెలియజేశారు. బొమ్మచెక్కి, రంగులు వేయడానికి ఒక రోజంతా పట్టిందన్నారు. చరిత్రలో నిలిచిపోయే ఇటువంటి బొమ్మలు ప్రత్యేకించి తయారు చేయాలను కుంటున్నట్లు తెలిపారు.



4 సెంటీ మీటర్ల కృష్ణుడి బొమ్మ



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నూకరాజు

కొబ్బరి మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో శుక్రవారం స్టీల్ ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్ల రామ జోగి నాయుడు, దొడ్డి సన్నిబాబు, మల్ల వరాహ శ్రీనివాస్ కోయిలాడ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పడమటమ్మ ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నరసింగరావు పేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు కసింకోట గ్రామ దేవత పడమటమ్మ ఉత్సవ పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ రహదారి అభివృద్ధికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ బౌద్ధ ఆరామ క్షేత్రం, పర్యాటక కేంద్రమైన బొజ్జన్న కొండ రహదారి మరమ్మతుల కోసం ఎంపీ డాక్టర్ బివి సత్యవతి రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీనిపై సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్ల నాగభూషణం స్పందిస్తూ ఇప్పటికే ఈ రోడ్డు అభివృద్ధికి రూ.9లక్షలుర మండల నిధులు మంజూరయ్యాయని, వీటితో రోడ్డును తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం హర్షనీయమని పేర్కొన్నారు.

మాతృభాషకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్ని భాషలు నేర్చుకున్న మాతృభాష తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. స్థానిక లక్ష్మీదేవిపేట లక్ష్మీ గ్రంథాలయం గౌరవ అధ్యక్షులు కొణతాల సన్యాసిరావు, అధ్యక్షులు బుద్ధ భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించారు. పద్యాల పఠనంతోనే తెలుగుపై పూర్తి పట్టు విద్యార్థులకు సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి నాగేశ్వరరావు, గ్రంథాలయ సభ్యులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20 వరుకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయం అధికారి యస్.వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 గ్రంథాలయం వారోత్సవాలు ప్రారంభం, 15న పుస్తకాలు ప్రదర్శన, డిపాజిట్లు సేకరణ, మ్యూజికల్ చైర్ పోటీలు, 16న పద్యాలు, చిత్ర లేఖన పోటీలు, 17న వ్యాసరచన పోటీలు, 18న చదరంగం, క్విజ్ పోటీలు, 19న మ్యూజిక్ చైర్ పోటీలు, 20న ముగింపు, బహుమతులు ప్రదానం ఉంటుందని తెలిపారు.

జగనన్న కాలనీ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని మునగపాక -1 జగనన్న కాలనీల నిర్మాణాలను స్పెషల్ ఆఫీసర్ లింగేశ్వర రెడ్డి శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. పునాదులు తవ్వటం మూలంగా గోతులలో నీరు పైకి ఉబికి నిర్మాణాలు చేపట్టడం కష్టంగా ఉందని లబ్ధిదారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఎమ్ఆర్ఓ బాబ్జి, ఈవోపీఆర్డి పి.ఈశ్వరరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు చేపట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని ఎంపిపి గొర్లి సూరిబాబు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తహశీల్దారు పీవీఎల్ఎన్ గంగాధర్ రావుతో కలిసి సందర్శించారు. కొద్దిసేపు గణిత ఉపాధ్యాయునిగా మారి లెక్కలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ దివాకర్, గొలగం మారేడుపూడి సర్పంచులు నరసింగరావు, కనక సన్యాసిరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ విసి ముత్యాలనాయుడు, కాసీం తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దేశంలో అందరికీ ఉచిత విద్యతో పాటు అనేక విద్యా సంస్కరణలను ఆయన ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెసి కల్పనా కుమారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు జానకి దేవి, సాంబమూర్తి, ఫ్యూచర్ వరల్డ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థల్లో ఆయన విగ్రహానికి మాజీ విసి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆత్మవిశ్వాసంతో, ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వ అధికారులై ఆదర్శంగా నిలిచిన నక్కపల్లి సబ్-రిజిస్ట్రార్ జిలాని బేగం గౌసియా, దొడ్డిగల్లు పంచాయతీ కార్యదర్శి షంసున్నీసా బేగంను అయ్యన్న విద్యాసంస్థల తరపున జ్ఞాపికలను అందజేసి, సత్కరించారు. ఏయూ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ షేక్ ఖాదర్ బాబాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎయు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వల్లి శ్రీనివాస్, ఎస్.వీరకుమార్, స్కూల్ ప్రిన్సిపల్ హరిషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పివి.రమణ ఆధ్వర్యంలో ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయరాలు డిఎన్‌బి.కూమారి అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.సింహాద్రి, ఆంగవాడీ టీచర్, పాఠకులు పాల్గొన్నారు.

భూ దోపిడీకే రాజధాని డ్రామాలు

టిడిపి మాడుగుల పరిశీలకులు లొడగల కృష్ణ



మాట్లాడుతున్న టిడిపి నాయకులు కృష్ణ, వేదికపై పివిజి.కుమార్ తదితరులు

ప్రజాశక్తి - దేవరాపల్లి

విశాఖ ప్రాంతంలో భూముల దోపిడీ కోసమే వైసిపి ప్రభుత్వం పరిపాలన రాజధాని డ్రామాలాడుతోందని టిడిపి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు లోడగల కృష్ణ ఆరోపించారు. రియల్ టైం స్టేటజీపై నియోజకవర్గస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం స్థానిక రెల్లివీధి సమీపంలో టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగాయి. ఇందులో పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ అందమైన విశాఖ ప్రాంతాన్ని మనీ లాండరింగ్ పేరుతో దోసుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో కూల్చివేతలు, దౌర్జన్యాలు, అరాచకాలు, దోపిడీలు పెచ్చు మీరుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ మాట్లాడుతూ నాలుగు మండలాల పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి టిడిపికి పూర్వవైభవం తీసుకొద్దామన్నారు. అనంతరం ఆర్టిఎస్ ట్రైనింగ్ కమిటీ సభ్యులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతల పాత్రునాయుడు, కర్రి సింహాద్రి నాయుడు, సబ్బవరపు రామానాయుడు, కశిరెడ్డి అప్పలనాయుడు, శరఖాన సూర్యనారాయణ, చింతా సాంబమూర్తి, గుల్లిపల్లి అర్జునరావు, బండారు రామారావు, కర్రి పుష్ప, జూరెడ్డి రాము, పేరపు కొండబాబు, రెడ్డి సన్యాసినాయుడు, గొల్లవెల్లి శ్రీరామ్మూర్తి, మజ్జి బాబ్జి, దొగ్గ దేముడు నాయుడు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా కశింకోట-బంగారుమెట్ట రహదారి

లారీ దిగబడిపోవడంతో డస్ట్‌ను అక్కడే విడిచి, వెళ్లిపోయిన వాహనదారుడు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

కశింకోట -బంగారమెట్ట రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఈ మార్గంలో వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. కసింకోట నుండి రాజాం జంక్షన్ వరకు రోడ్డు మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. రెండు రోజుల క్రితం నీలకంఠాపురం మెట్టపాలెం జంక్షన్ల మధ్య క్వారీ డస్ట్ రవాణా చేస్తున్న లారీ రోడ్డు మధ్యలోనే దిగబడిపోవడంతో లారీలో ఉన్న సుమారు పాతిక టన్నుల డస్ట్ ను రోడ్డుపైనే విడిచి వెళ్లిపోయాడు. రోడ్డు మరమ్మతులకు గురైతే కంకర వేసి దానిపై తారు వేసి మరమ్మతులు చేపట్టేవారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతులు గురైతే ఆయా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇల్లు తొలగింపు డస్టనా లారీలతో తీసుకొచ్చి గోతుల్లో వేశారు. అలాగే పొలాల్లో మట్టిని రోడ్డుపై వేయడం జరిగింది. నీలకంఠాపురం-మెట్టపాలెం జంక్షన్ మధ్య పడిన గోతిలో గతంలో మట్టి వేయడంతో గురువారం రాత్రి అధికలోడుతో (క్వారీ డస్ట్) వెళ్తున్న లారీ దిగబడిపోయింది. దీంతో వాహనాలు రాకపోకలకు అవకాశం లేక రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు గొడవ చేయడంతో లారీ యజమాని జెసిబిని రప్పించి లారీలో ఉన్న డస్టనా మొత్తం రోడ్డుపైనే కుప్పలుగా వేసి లారీని ఏదో విధంగా బయటకు నెట్టుకొని వెళ్లిపోయాడు. ఈ రోడ్డులో ప్రయాణం నరకంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు.



గోతులతో అస్తవ్యస్తంగా ఉన్న రహదారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డిఎంహెచ్ఓ తదితరులు

కుష్టు వ్యాధి సర్వే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా అనకాపల్లిని చేయడంలో అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో కలిసి ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న కుష్టు వ్యాధిపై సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని అంతం చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ వాలంటీర్లు ఆశ వర్కర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి గుర్తింపు లక్షణాలను వివరించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు ఎయిడ్స్ టిబి నివారణ అధికారి శారదాబాయి, డిఎల్‌డిఓ మంజులవాణి, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఝాన్సీ రాణి, వరహాల బాబు పాల్గొన్నారు.

ప్రధాని సభకు జనాన్ని తరలించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : విశాఖ ఏయు ఇంజనీరింగ్ మైదానంలో శనివారం జరుగు ప్రధాని నరేంద్ర మోడీ సభకు కె.కోటపాడు మండలం నుండి భారీ సంఖ్యలో జనాలను తరలించాలని జెడ్పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్‌తో ఆమె సమావేశమై ప్రధాని సభ జనసమీకరణపైనా, సభకు వచ్చే వారికి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, గొర్రెపోటు వెంకటరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో ఉపాధి హామీ పనులపై సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నిర్వహించాల్సిన పలు పనులపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ మొల్లేటి దేవి, వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, అమ్మాజీ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, నాని, యల్లపు హైమావతి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- దేవరాపల్లి : అక్టోబర్‌లో ఏలూరులో జరిగిన ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో దేవరాపల్లి మండలం వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దమ్ము గణేష్ అండర్ 14 లాంగ్ జంప్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన గణేష్‌ని, పీడీ తమ్మునాయుడును పాఠశాల తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస్, ఆర్ పరమేష్, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శటారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి లక్ష్మీ బలరాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవుపల్లి నరసింహమూర్తి, పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు.

బిసిల సంక్షేమంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరిని శుక్రవారం అనకాపల్లి సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బిసిల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జొన్నకోట చెన్న మూర్తి, కృష్ణ, కిరణ్, రాజు పాల్గొన్నారు.

మృతి చెందిన పారిశుధ్య కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఇటీవల మండలానికి చెందిన కోడూరు గ్రామ పారిశుధ్య కార్మికుడు ఎల్లబెల్లి సూరిబాబు మృతి చెందగా, ఆయన కుటుంబానికి అనకాపల్లి జిల్లా పంచాయతీ కార్మిక యూనియన్ (సిఐటియు) సేకరించిన రూ.5,600 శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు పలివెల చిన్నారావు, కార్యదర్శి ములకలపల్లి అప్పలరాజు, కమిటీ సభ్యులు పార్వతి ఈశ్వరమ్మ, లోకేష్ అప్పారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు పాల్గొన్నారు. 20 ఏళ్లగా పనిచేస్తున్న సూరిబాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రూ.435 కోట్లతో డిగ్రీ కళాశాలల భవనాలు

ఉన్నత విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న పోలా భాస్కర్

ప్రజాశక్తి-మాడుగుల: రాష్ట్ర వ్యాప్తంగా రూ.435 కోట్ల రూపాయలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల భవనాలు నిర్మిస్తున్నట్లు ఉన్నత విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. శుక్రవారం మాడుగుల వచ్చిన ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 30 కళాశాలలకు రూ.14.5 కోట్ల చొప్పున భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అన్ని కళాశాలకు ఒకే డిజైన్‌తో నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. స్వంత భవనాలు లేని పలు కళాశాలలకు స్థలాలు ఏర్పాటు చేశామని, మాడుగుల కళాశాలకు ఇటీవల 5 ఎకరాల స్థలం కేటాయించినట్లు చెప్పారు. కొంత కాలంగా మాడుగుల కళాశాలకు స్థల సమస్య ఉందని, యుజిసి నిబంధనల మేరకు అవసరమైన 5 ఎకరాల స్థలం కేటాయించామన్నారు. ప్రత్యేక ఎన్నికల అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, వివాహమై అత్తింటికి వెళ్లిన వారి పేర్లను సరి చేయవలసి ఉందన్నారు. ఓటర్ల జాబితా నుండి మరణించిన వారి పేర్లు కూడా తొలగించి తుది జాబితా తయారు చేయాల్సి ఉందని తెలిపారు. వివాదాలు రాకుండా ఉండేందుకు ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టాలని సూచించారు.


డిగ్రీ కళాశాల భాస్కర్ పరిశీలన

నక్కపల్లి:స్థానిక డిగ్రీ కళాశాలను రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ పోలా భాస్కర్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుని డిగ్రీ కళాశాలలో ఉన్న అధ్యాపకులను ఇక్కడికి వచ్చి బోధించే విధంగా చూడాలని ప్రిన్సిపల్ కు సూచించారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలకు స్థానిక మార్కెట్ సమీపంలో స్థలం అనుకూలంగా ఉంటుందని మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ పోలా భాస్కర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థలాన్ని పరిశీలించి వేగవంతంగా నివేదిక అందజేయాలని తహశీల్దార్ సుబ్రమణ్యం శాస్త్రిని ఆదేశించారు. అనంతరం ఆయన హైస్కూల్లోని రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, ఎలక్షన్ డిటి తాతాచార్యులు పాల్గొన్నారు.

భూ కబ్జాలను అరికట్టాలి



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అనకాపల్లి జిల్లాలో భూ కబ్జాలను అరికట్టాలని రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. మండలంలోని చెట్టుపల్లి లో విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు సాగు భూములను, ప్రభుత్వ భూములను బడా బాబులు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అక్రమాలకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో పలు మండలాలలో కబ్జాలకు పాల్పడుతున్న విషయాలను అనేకమార్లు జిల్లా కలెక్టర్లకు, ఆర్డీఓలకు, తహశీల్దార్లకు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు శూన్యమన్నారు. చట్టాలను తుంగలో తొక్కుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. తప్పు చేసిన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు లేకపోవడంతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు.



సుభద్రతో ఎంపిపి, నాయకులు

సుభద్రకు ఘన సత్కారం

ప్రజాశక్తి -చీడికాడ:ఈనెల 12న విశాఖలో జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు చీడికాడ మండలం నుండి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ జే.సుభద్ర కోరారు. శుక్రవారం చీడికాడ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమెను ఎంపీపీ కొరచా జయమ్మ నారాయణమూర్తి, జెడ్పిటిసి లాలం శారద వరలక్ష్మీ జానకిరామ్ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె చైర్ పర్సన్ మాట్లాడుతూ,విశాఖలో జరిగే పీఎం బహిరంగ సభకు మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ ఎర్ర అప్పారావు, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, ఎంపీడీవో జయప్రకాష్‌రావు, పాల సంఘం అధ్యక్షులు పరవాడ అప్పారావు పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఛైర్‌పర్సన్‌గా పార్వతి



ప్రజాశక్తి -నాతవరం:నాతవరం పిఎసిఎస్ చైర్ పర్సన్‌గా అంకిరెడ్డి పార్వతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమీల్ మరణంతో అధ్యక్ష పదవి ఖాళీ అవ్వడంతో ఆ స్థానంలో ఆయన భార్య పార్వతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అంకిరెడ్డి పార్వతి నాతవరం గ్రామ సర్పంచ్‌గా కూడా పనిచేశారు.

ఆంజనేయస్వామికి పూజలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో బికెపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పెట్ల లింగన్న నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం స్వామివారికి గ్రామస్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అయ్యన్న పాత్రుడు కుమారుడు రాజేష్ దర్శించు కున్నారు. గ్రామంలో అన్న సమారాధన నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాశీనాయుడు, పెట్ల నరేష్, లింగన్న యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో రాణించి పాయకరావుపేట నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకు రావాలని ఎంఈఓ డివిడి ప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం సీఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఎంపిక నిర్వహించారు. ఎంఈఓ డివిడి ప్రసాద్, హెచ్ఎం రాణి లలిత క్రీడా పోటీలు ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రతిభా వంతులైన గ్రామీణ క్రీడాకారులకు సిఎం కప్ ఆటలు పోటీలు చక్కని అవకాశమని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహద పడతాయన్నారు. నియోజకవర్గ క్రీడల ఇంచార్జ్ కుందూరు రాజు మాట్లాడుతూ, కబడ్డీలో 12, వాలీబాల్‌లో 12, క్రికెట్‌లో 16 మంది క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు రాంబాబు, రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, దేవుళ్ళు, చిరంజీవి, రహమాన్, రవి, సూకరాజు తదితరులు పాల్గొన్నారు.



పరిచయం చేసుకుంటున్న ఎంఇఒ

లెప్రసీ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- కోటవురట్ల:లెప్రసీ వ్యాధి పట్ల గ్రామీణ ప్రాంతాలలో విస్తారంగా అవగాహన కల్పించాలని వైద్యులు సంతోష్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లెప్రసీని తొలి దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎనీమియా పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అన్నసమారాధనకు పైలా విరాళం

ప్రజాశక్తి- చీడికాడ :మండలం అర్జునగిరి గ్రామంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు హాజరయ్యారు. అన్న సమారాధన కార్యక్రమానికి రూ.5 వేల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లి శ్రీను, ఎంపీటీసీ పెంటకోట అమ్మతల్లి నాయుడు, మాజీ ఎంపిటిసి కసిరెడ్డి గణపతి, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు జాజిమొగ్గల ప్రసాద్, మాజీ సర్పంచ్ యామల లక్ష్మణ్, ఎంపీటీసీ పెంటకోట అమ్మ తల్లి నాయుడు, వైస్ ప్రెసిడెంట్ గొర్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పైలా ప్రసాదరావు



పాల్గొన్న రైతులు

'పశు విజ్ఞాన బడి'పై అవగాహన

ప్రజాశక్తి-మాడుగుల:పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు లింగ నిర్ధారిత వీర్య నాళికల ద్వారా ఉత్పత్తి పథకం, 60 శాతం సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాన పథకం, పశుగ్రాస విత్తనాల లభ్యత అంశాలపై అవగాహన కల్పించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టి నాయుడు లంపి స్కిన్ వ్యాధి పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు రావులపూడి సూరిబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అవినీతి

ప్రజాశక్తి- పాయకరావుపేట: జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో అధికార పార్టీ నాయకులు వేలకోట్ల దోపిడీకి పాల్పడ్డారని జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్త, జనసేన యూత్ అధ్యక్షులు గేదెం చైతన్య పేర్కొన్నారు.పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో అవినీతి వ్యవహారాలను వెలుగులోకి తేవడం కోసం తమ పార్టీ' జగనన్న ఇల్లు-పేదల పాట్లు' అనే కార్యక్రమానికి పిలుపు ఇచ్చిందన్నారు. ఈనెల 12, 13 తేదీలలో తమ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు కాలనీల పరిస్థితులను పరిశీలిస్తారని చెప్పారు. 14న సోషల్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. కాలనీల నిర్మాణ ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తమ రాష్ట్ర పార్టీకి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు గేదెం చైతన్య, పల్లెలు దుర్గారావు, జగ్గన్న దొర, పులగపూరి అప్పల నరస, నల్లల రాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిసిలు, దళితులపై పెరిగిన దాడులు

మాజీ మంత్రి జవహర్



మాట్లాడుతున్న జవహర్

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోని బిసిలు, దళితులపై దాడులు అధికమయ్యా యని మాజీ మంత్రి కెఎస్. జవహర్ ఆరోపించారు. శుక్రవారం మాజీ మంత్రి జవహర్ ఆధ్వర్యంలో కొవ్వూరు నుంచి 50 కార్లలో నర్సీపట్నంకు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుకు సంఘీభావం తెలియజేసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో జవహర్ మాట్లాడుతూ, చెత్త పన్నుపై ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన మొదటి వ్యక్తి అయ్యన్నపాత్రుడు అని అన్నారు. బీసి అయినందునే అయ్యన్నను టార్గెట్ చేశారని చెప్పారు. అనంతరం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, జగన్ ఉన్నంత కాలం ఇలాంటి ఘటనల జరుగుతూనే ఉంటాయన్నారు.

వేంపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వేంపాడు గ్రామంలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గోడిచెర్ల మెడికల్ ఆఫీసర్ ఎస్.సుకన్య రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవి, సుఖ వ్యాధులు, టీబీపై డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏడిద సూకరత్నం, వేంపాడు పిఎసిఎస్ పర్సన్ ఇంచార్జ్ అయినంపూడి మణిరాజు, ఉప సర్పంచ్ అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు కె.మధు, వైద్య సిబ్బంది మణికుమారి, ఏఎన్ఎం వెంకట లక్ష్మి, ఆశా వర్కర్లు, లింక్ వర్కర్స్, సూపర్వైజర్ డి.రమణ, ఆదినారాయణ నర్సింగరావు, కె.ఇందిర, ఎస్.,భవాని, కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పేదలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం పిహెచ్‌సి వైద్యాధికారి ఉమాదేవి కోరారు. శుక్రవారం ఆమె బికెపల్లిలో దాదాపు 70 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేసినందుకా

మోడీ సభకు జనాల తరలింపు..?

ప్రజాశక్తి-రోలుగుంట: ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రం కోసం ఏమి చేశారని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసినందుకా సభకు వైసిపి ప్రభుత్వం జనసమీకరణ చేస్తుందని టీడీపీ బీసీ సాధికారత రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోడీ సభకు ప్రభుత్వం మూడు లక్షల మందిని తరలించేందుకు అన్ని గ్రామాల్లో ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రానికి మోడీ ఏ విధమైన న్యాయం చేశారని ప్రజలను సమీకరిస్తున్నారని ప్రశ్నించారు.

నిత్యావసర వస్తువులు, వంట గ్యాస్, ఆయిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపినందుకా అని ప్రశ్నించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ కంపెనీలకు అమ్మేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం ప్రజలను కూడా మోసం చేసినందుకు ప్రభుత్వం, మంత్రులు ప్రజలు తరలిస్తున్నారని అని ఎద్దేవా చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేట్‌కరణ ఆపాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాన్ని ఆపాలన్నారు. తుని నుండి చోడవరం మాడుగులు మీదుగా పెందుర్తికి కొత్త రైల్వే లైను కలపాలని డిమాండ్ చేశారు.

అధికార పార్టీ అవినీతిని వెలికితీస్తాం

ప్రజాశక్తి-గొలుగొండ: పేద ప్రజలకు ఇళ్లు ఇస్తామన్న వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో చేసిన మోసాలను వెలికితీస్తామని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం గొలుగొండలో జనసేన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు ఈ నెల 12, 13, 14 తేదీల్లో జగనన్న ఇళ్లు...పేదల కన్నీళ్లు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12న నర్సీపట్నం మున్సిపాలిటీ బయపురెడ్డిపాలెం వద్ద టిడ్కో ఇళ్ల వద్ద, 13న నాతవరం మండలంలో జగనన్న కాలనీ వద్ద, 14న గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లోని జగనన్న కాలనీల వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. అన్యాయం జరిగిన లబ్ధిదారులు ఆ సమస్యలను తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల్లో మోసాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, దుంపలపూడి సహదేముడు పాల్గొన్నారు.



హాజరైన ఎంపిపి, ఎంపిడిఒ

సజావుగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీడీవో జయ మాధవి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. ఎంపీపీ రాజేశ్వరి మాట్లాడుతూ, మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే ఈ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం తగదన్నారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు సూచించారు. పలు శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ రమణ, జడ్పిటిసి సుకల రవణమ్మ, వైస్ ఎంపీపీ ఇన్నమ్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

మోడీ పర్యటనపై మిన్నంటిన నిరసనలు

▸▸వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ధర్నా, ర్యాలీలు ▸▸ప్రధాని మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు



గాజువాకలో ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రధానమంత్రి మోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వాహాపక్షాలు, ప్రజా సంఘాల నేతలు ఆందోళన చేపటాటరు. మోడీ గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ప్రజాశక్తి- కంచరపాలెం : స్టీల్‌ప్లాంట్ అమ్మాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకుని, ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని విశాఖ పర్యటనలో ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ కంచరపాలెంలో సిపిఎం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మోడీ గో బ్యాక్ నినాదాలు చేశారు. ప్రధాని. మోడీతో ప్రకటన చేయించడంలో విఫలమైన ముఖ్యమంత్రి జగన్, అదే పనిచేస్తున్న వారిని పోలీసులతో అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోవడం సరికాదన్నారు. సిఐటియు నాయకులు ఎస్ సోమేశ్వరరావు, ఒ అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు

హెచ్‌పిసిఎల్ మెయిన్‌గేటు వద్ద నిరసన

ములగాడ : విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మబోమని సభలో మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హెచ్‌పిసిఎల్ మెయిన్‌గేటు వద్ద సిఐటియు, ఐఎన్‌టియుసి కార్మికసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు భోగవల్లి నాగభూషణం, సిఐటియు నేతలు పి.పైడిరాజు, ఎం.కృష్ణారావు, జి.నరేష్, పి.సురేష్, టిఎన్‌టియుసి నేత పి.కృష్ణ, ఐఎన్‌టియుసి నేత తాతబాబు, నర్సింగరావు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా వామపక్ష పార్టీలతోపాటు అనుబంధ కార్మిక సంఘాల నేతలను ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం దారుణమని సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు ఒక ప్రకటనలో ఖండించారు.

మధురవాడ : ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును అమ్మొద్దని డిమాండ్ చేస్తూ జివిఎంసి మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఐదోవార్డు మారికివలస జివిఎంసి కల్యాణమండపం వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి కార్మికులు నిరసన చేపట్టారు. యూనియన్ మధురవాడ జోన్ కార్యదర్శి జి.కిరణ్, సిఐటియు జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు, వార్డు అధ్యక్షులు జి విజయ్, కొండమ్మ, జయమ్మ, వి చిన్న, ఎ.సత్యం పాల్గొన్నారు.

పెందుర్తి: స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మోడీ రాకను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో 97వ వార్డు సుజాతనగర్ కూడలిలో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.శ్రీనివాసరావు సిఐటియు నాయకులు సూర్యప్రకాష్, శంకరరావు, జగనన్న, స్వామి. కె.అప్పలనాయుడు, సిపిఐ నాయకులు వై రాంబాబు పాల్గొన్నారు

గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, విశాఖలో ప్రధాని మోడీ పర్యటనను నిరసిస్తూ ఆటోనగర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు నగర కమిటీ సభ్యులు రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ విభజన హామీల అమలులో మోసం, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.



నర్సీపట్నంలో...

భెల్ మెయిన్‌గేటు వద్ద ధర్నా

గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల పట్ల మోడీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భెల్ మెయిన్ గేటు వద్ద అఖిలపక్ష కార్మికసంఘాల ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కార్మిక నేతలు జిటివి. ప్రకాష్, వి. బాబురావు, పిఇఎన్. రాజు, ఎ. వెంకటేశ్వరరావు, ఎస్ షాహు, పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ నిరసన

కంచరపాలెం : ఏటా రెండుకోట్ల ఉద్యోగాలను కల్పిస్తానని యువతను నమ్మించి మోసగించిన ప్రధాని మోడీకి సమాధానం చెప్పాలనిడిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వాసు, పి.విజయ, ఎస్ శ్రావణ్ కుమార్, బి. మురళి, స్టీఫెన్ పాల్గొన్నారు.

తగరపువలస : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలని స్థానిక వై.జంక్షన్‌లో సిపిఎం, సిఐటియు నాయకులు రాస్తారోకో నిర్వహించారు.



మల్కాపురంలో..

ప్రధాని మోడీ రాకను నిరసిస్తూ నగరంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు పాల్గొన్నారు.

పిఎం పాలెం: విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలనే డిమాండ్ చేస్తూ, విభజన హామీల అమలులో రాష్ట్రాన్ని మోసపుచ్చిన ప్రధానిమోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ మధురవాడ జివిఎంసి జోన్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఎం, అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం, సిపిఐ డివిజన్ నేతలు నాయకులు డి అప్పలరాజు, వి సత్యనారాయణ సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్, సిపిఐ కార్యకర్తలు ఎం బంగారయ్య, తాతారావు , పాల్గొన్నారు.



అనకాపల్లిలో...

ములగాడ: విశాఖలో మోడీ పర్యటన నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యల్లో భాగంగా సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తిని నెహ్రునగర్‌లోని అతని ఇంటి నుంచి బయటకు రాకుండా గృహనిర్బంధం చేశారు.

అనకాపల్లి : రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న ప్రధాని మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నెహ్రూ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం మాట్లాడారు. సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, సుభాషిణి, పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ళ తేలయ్య బాబు, పి చలపతి, బి నూక అప్పారావు, సిపిఐ నాయకులు దొరబాబు, కోన లక్ష్మణ, సన్యాసిరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ సంఘీభావం తెలిపారు. సిపిఎం నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, ఎర్ర దేవుడు, గూనూరు నాయుడు పాల్గొన్నారు.



కంచరపాలెంలో...

సబ్బవరం : సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యాన స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ముఠా కార్మికులతో కలిసి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మొల్లేటి గౌరీశ్వరరావు, నరసమ్మ, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ ఫార్మసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు కండిపల్లి అప్పలరాజు, రమణ, జి.చిట్టిబాబు, పి శేషు, మూసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖలో పర్యటనను నిరసిస్తూ నక్కపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఉపమాక ముఖ ద్వారం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్రం లో పర్యటించే అర్హత లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా తీవ్రమైన అన్యాయం చేశారని, 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను బిజెపి ప్రభుత్వం కారుచౌకగా అమ్మేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌బాబు, వీర్రాజు, నాగేశ్వరరావు, తాతాజీ, రామకృష్ణ, అప్పలరాజు, వీరన్న, జాన్, బాపూజీ, బాలయ్య, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పీఎం గో బ్యాక్ అంటూ స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బ్లాక్ జెండాలతో నిరసన చేపట్టారు. వామపక్ష నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, డి సత్తిబాబు మాట్లాడుతూ, రాష్ట్రానికి విభజన హామీ అమలు చేయలేదని. ప్రత్యేక హెూదా ఊసే లేదని తెలిపారు.అంబానీ వంటి బడా బాబులతో పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రం చూస్తోందని విమర్శించారు.స్టీల్ ప్లాంట్, రైల్వే, బిఎస్ఎన్ఎల్ ఎల్ఐసి, బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు ఎల్.వి. రమణ, సిఐటియు నాయకులు కే నానాజీ, టి.ఈశ్వరరావు, నర్సీపట్నం నియోజకవర్గ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, జోగురాజు, శ్రీరామమూర్తి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు రాధాకృష్ణ పాల్గొన్నారు.



నక్కపల్లిలో...